# యాదగిరి




శ్రీమతి. టి.పి. దేవనాధన్

గార్డు పచ్చ జండా చూపించడంతో రైలు కూత వేసింది, "బయలుదేరు తున్నానోయ్" అని చెప్తున్నట్టుగా.

"పైలం బిడ్డా" అంది రాములమ్మ పంద వ్యాకసారిగా ప్లాట్‌ఫారమ్ నుండి.

"నువ్వేం ఫికిరి చెయ్యకే. నేను చూస్కుంట" అంది లక్షమ్మ.

"అమ్మా! పోతున్నా" అంటూ బిగ్గరగా అరిచాడు యాదగిరి కదుల్తున్న బండిలోంచి.

"ఆ! మంచిది బిడ్డ" అన్న రాములమ్మ మాటలు గాలిలో కలిసి పోగా చేయి ఊపుతూ నిలబడింది.

అమ్మ కనబడ్డంత వరకు కిటికీలోంచి నిలబడి చూసి తరువాత కూర్చున్నాడు యాదగిరి. వాడికి పదేళ్ళుంటాయి. వజ్రాల్లాంటి వాడి కళ్ళు ఈ ప్రపంచానికి అద్దం పడుతున్నట్టుగా మెరుస్తున్నాయి. ముఖంలో నవ్వు దాగటంలేదు. రైలు బండి కుదుపుని ఆనందంగా అనుభవిస్తున్నట్టుగా వాడు యింకాస్త ముందుకీ, వెనక్కీ వూగుతున్నాడు. చేతిలో, అమ్మ ఆప్యాయంగా పెట్టిన వాయిగణాల బిళ్ళని, భద్రంగా జేబులో వేసుకున్నాడు. బయట చూస్తే చెట్లన్నీ బండితో పాటు పరిగెడుతున్నాయి. చాలా ఆశ్చర్యంగా చూస్తూ, రెప్ప వేయటం కూడ లేదు యాదగిరి.

వాడు అలా చూడటంలో ఆశ్చర్యంలేదు మరి. వాడెప్పుడు రైలుబండి ఎక్కింది లేదు. ఆ అవకాశం, అవసరం రెండూ రాలేదు యిప్పటి వరకు. మొన్నీ మధ్య వాళ్ళనాన్న పోయాడు. నెల రోజులైంది. ఆయన పోయినప్పుడు వచ్చింది యాదగిరి పెద్దమ్మ, లక్షమ్మ. ఆమె హైదరాబాదులో గవర్నమెంటు ఆఫీసు తోటలో పనిచేస్తుంది. దినకర్మలన్నీ పూర్తయ్యాక తెల్లవారు ఝామునే వెళ్తా లక్షమ్మ, అమ్మరాములమ్మతో మాట్లాడ్డం విన్నాడు మెళుకువ వచ్చిన యాదగిరి.

"ఇగ ఆయన పోయిండు. నీకెట్ల యెల్లాలే నేను పట్నం పోయి మాదొరను, మన యాదగిర్ని యింట్ల కొల్వుంచుకుంటడేమో అడుగుతా. మంచిదోంటే మల్లొచ్చి తీస్కపోతా" అంది లక్షమ్మ.

"సంటోన్ని గంత దూరానికెట్ల పంప పోతావే" అంది రాములమ్మ సందేహంగా.

"గట్లంటే యెట్ల నాలుగు పైసలొస్తయి. అన్నం గిట పెడ్తరు. పెద్దగయ్యిడోంటే యేడనన్న కొల్వుపెట్టి పిస్తరు. ధైర్నం చేస్కో శెల్లె" అంది లక్షమ్మ.

యాదగిరి లేచి వచ్చి "అమ్మా నేను పోతనే పెద్దమ్మతోని" అన్నాడు.

"సరే సూతాం" అంది రాములమ్మ లక్షమ్మని సాగనంపుతూ.

ఆ రోజునుంచి యాదగిరి వాళ్ళ పెద్దమ్మ కోసం ఎదురు చూస్తున్నాడు. తన యిద్దరు చెల్లెళ్ళతోను గర్వంగా చెప్తున్నాడు "నేను పట్నం పోతున్నను. కొల్వు చేస్తను. ఇగ నేను చెప్పినట్టు యినాలె" అని. అనుకున్న రోజు రానే వచ్చింది. పెద్దమ్మ యిప్పుడు


తనని తీసుకొనీ పోతోంది. నాన్న బతికున్న రోజుల్లో పస్తులంటూ వుండలేదు కాని తిన్నామనిపించే వాళ్ళు. పెద్దమ్మ వచ్చినప్పుడే పిల్లలకు పండుగ పట్నం నుంచి మిఠాయిలు తెచ్చేది, దొర పిల్లలవి బట్టలు తెచ్చేది. అందుకే యాదగిరి మహదానంద పడ్డాడు, పెద్దమ్మ వచ్చిన మూన్రోజులే యింత బాగుంటే, ఆమెతో పట్నంలో వుండటం యింకెంత బాగుంటుందో కదా అని. అందుకే, ఆ ఆనందం వాళ్ళ నాన్న పోయిన దుఃఖాన్ని అధిగమించి యాదగిరి మొఖంలో ప్రస్ఫుటంగా ద్యోతకమౌతోంది.

* * * *

పెద్దమ్మతో సికిందరాబాదు స్టేషన్‌లో దిగిన యాదగిరి ఆశ్చర్యంగా చూస్తున్నాడు. స్టేషన్లో అక్కడక్కడా డబ్బాల్లా వేళ్ళాడదీసిన వాటిల్లోంచి బొమ్మలు కదుల్తున్నవి.

''పెద్దమ్మా యేందో అది'' అనడిగాడు.

''టి.వి. బిడ్డా చిన్న సీన్మ. మన దొరతాన




గూడున్నది'' అంది. యాదగిరికి మరో ప్రపంచంలా వుంది. అన్నింటినీ వింతగా చూస్తున్నాడు బస్సులో యెక్కి మారెడ్‌పల్లి తీసికెళ్ళింది లక్ష్మమ్మ.

ఇంద్రభవనం లాంటి ఇంట్లో అడుగుపెట్టారు లక్ష్మమ్మ, యాదగిరి. ''నమస్తే దొర'' అంది లక్ష్మమ్మ బయలుదేరుతున్న ఆఫీసర్ రామనాధాన్ని చూసి.

''ఆ ఆ! నమస్తే. ఎవరీ కుర్రాడు'' అనడిగారు రామనాధం.

''మా చెల్లె కొడుకు దొర నీ భాంచన నెచెప్తిగద ఆడే, నీ కాడికి తీసికొస్తి'' అంది లక్ష్మమ్మ.

''ఆహా అచ్చాచ్చా గుర్తొచ్చింది'' ''సరే అమ్మగారితోమాట్లాడు'' అనేసి కారెక్కి వెళ్ళిపోయారు.

అమ్మగారు అనసూయమ్మ రానే వచ్చింది. ఎగాదిగా చూసి ''బాగా పని చేస్తాడంటే చెప్ప లక్ష్మమ్మ. లేకపోతే ఎందుకు, తిండి దండగ'' అంది.

యాదగిరికి మొదటిసారిగా ఆత్మాభిమానం దెబ్బ తినింది. తలెత్తి పెద్దమ్మ వైపు చూశాడు. కళ్ళతోనే వూర్కో అన్నట్టుగా చూసి ''పోరడు గద తల్లి నువ్వెట్లు చెప్తే అట్లేంటడు'' అంది.

''వూ సరేలే'' అంది అనసూయమ్మ, కాస్సేపుండి లక్ష్మమ్మ బయలు దేరింది ఆఫీసుకు.

''వస్త బిడ్డా'' అంది యాదగిరిని చూసి.

''పెద్దమ్మ! మనింటికెప్పుడు పోదాం'' అనడిగాడు యాదగిరి. ''లే బిడ్డా మనిల్లు శానా దూరం గదా, ఈడనే వుండాలే అమ్మగారు చెప్పింది చెయ్యాలే. నేనొచ్చి సూస్కుంట నిన్ను అప్పుడప్పుడు'' అంటు వెళ్ళిపోయింది. గేటువైపు బిక్క మొహం వేస్కొని చూస్తూ నిలుచుండి పోయాడు యాదగిరి.

''ఇదిగో యాదగిరీ! అయ్యగారు భోజనానికి వచ్చే వేళయింది కాని, గబగబా యిల్లంతా తుడువు బట్టలు వుతకాలి చాలా పనుంది'' అంది అనసూయమ్మ బకెటు, తుడిచే గుడ్డ చేతికిస్తూ.

''ఆ అట్లనే నమ్మా'' అంటూ తుడవడం మొదలెట్టాడు. అక్కడ గదుల్లో వున్న రకరకాల ఫోటోలు, నున్నటి మెరిసే గచ్చు, యివన్నీ చూస్తూ అలవాటు లేని పనైనా చకచకా చేసుకుపోయాడు యాదగిరి.

మధ్యాహ్నం మూడింటికి పిల్లలు బడి నుంచి వచ్చారు. రామనాధం గారికి ఇద్దరబ్బాయిలు, ఒకమ్మాయి. పెద్దబ్బాయి యాదగిరి కన్నా కొంచెం పెద్ద. తన వూళ్ళోవున్న పిల్లలకి యెంత తేడా వుంది'' అనను కున్నాడు వాళ్ళను చూస్తూ యాదగిరి.

రాత్రి పనంతా అయిపోయాక ఓ చాప, దుప్పటి యిచ్చింది అనసూయమ్మ యాదగిరికి. వరండాలో ఓ మూలగా చాపేసుకుని పడుకున్నాడు. క్షణం తీరిక లేక పని చేసిన యాదగిరికి అప్పుడు అమ్మ గుర్తొచ్చింది. హాయిగా అమ్మ వెచ్చటి గుండెల్లో ముడుచుకుని పడుకునేవాడు. ఇక్కడ తన కెవ్వరూ దిక్కులేనట్లు, తన వాళ్ళ దగ్గర్నుంచి దూరంగా తోసివేయబడ్డట్టని పించింది. తన చెల్లెళ్ళతో పోట్లాడుకుండానే దుఃఖం ముంచుకు వచ్చింది. ఏడ్చి, ఏడ్చి కాస్సేపటికి అలసిన శరీరం విశ్రాంతి కోరగా నిద్ర ఆవహించింది యాదగిరిని.

కాల చక్రం తన పని తాను చేసుకుపోతోంది యాదగిరి సికిందరాబాదొచ్చి నెలరోజులైంది. తను కన్న కలలకి, తనిప్పుడు వున్న స్థితికి పొత్తు కుదరక యింకా రాజీ పడలేక పోతున్నాడు. పెద్దవాడిలా ఆలోచిస్తున్నట్టున్నాయి వాడిచూపులు. ఫస్ట్‌కి పెద్దమ్మ వచ్చింది. యాదగిరి కళ్ళలో మెరుపు. రామనాధం గారు లక్ష్మమ్మకి డబ్బిచ్చారు యాదగిరి జీతమంటూ. అది అందుకొని కాస్సేపుండి వెళ్లబోయింది లక్ష్మమ్మ. ''పెద్దమ్మా! నేనొస్తనే'' అంటూ లక్ష్మమ్మని వాటేసుకొని ఏడ్చాడు యాదగిరి. లక్ష్మమ్మ తగ్గు స్వరంతో ''అట్ల ఏడ్వొద్దు బిడ్డా పండుగ ముంగల వస్త. అమ్మగార్నడిగి తోల్కపోతా'' అంది. ఆ గొంతు ఎందుకో అబద్ధం ఆడుతున్నట్టనిపించింది యాదగిరికి. వూరికి వచ్చే పెద్దమ్మలో వున్న హుందాతనం యిక్కడున్న పెద్దమ్మకి మచ్చుకైనా లేదు. వొదిగి వొదిగి చిన్నగా మాట్లాడుతోంది. తననేదో మోసం చేసినట్టుగా బాధపడ్డాడు యాదగిరి.

* * * *

ఆ రోజు మధ్యాహ్నం స్నేహితుల యింటికంటూ బయలు దేరింది అనసూయమ్మ. స్కూలు నుంచి రామనాధం పిల్లలు వచ్చారు. మరి కొంతమంది పిల్లలు, వాళ్ళ స్నేహితులు కూడా వచ్చారు. అంత మంది పిల్లల్ని, తన ఈడు వాళ్ళని చూసే సరికి యాదగిరికి చాలా వుత్సాహం వేసింది. గబగబ మంచినీళ్ళందించాడు. యాదగిరిని చూసి పిల్లలంతా నవ్వారు ''కోతి లాగున్నావు'' అన్నారు. యాదగిరి వేసుకున్న చొక్కా లాగు రామనాధం పెద్దబ్బాయివి. ఒకే యీడైనా పోషణ లేకపోవడంవల్ల ఆ డ్రస్సు యాదగిరి వంటిపై చాలావదులుగా వేళ్ళాడుతోంది. లాగుకూడా మోకాళ్ళు దాటి వదులుగా వేళ్ళాడుతోంది. ఆపిల్లలు యాదగిరిని చూసి 'కోతి' అన్నా బాధపడే స్థితిలో లేడు యాదగిరి. కోతి గుర్తొచ్చి నవ్వాడు. కోతిలా పిల్లి మొగ్గలు వేసి చూపించాడు. పిల్లలు యింకా నవ్వారు. అమ్మగారు లేరు. అంతా పిల్లలు యాదగిరికి వుత్సాహం వురకలు వేస్తోంది తను వూళ్ళో కోతి చేసిన వన్నీ చేసి చూపిస్తున్నాడు. కుర్చీల్లోంచి ఎగిరి ఎగిరి నవ్వుతున్న పిల్లలు ఒక్కసారిగా నవ్వు ఆపేశారు. హఠాత్పరిణామానికి తలెత్తి చూశాడు యాదగిరి. అనసూయమ్మగారు అపరకాళికాదేవిలా నిల్చుంది. ''రేయ్ సిగ్గులేదురా నీకు ఆ పిల్లలతో కలిసి ఆడతావా'' అంటూ హుంకరించింది. అంతా నిశ్శబ్దంగా వుండిపోయారు. యాదగిరికి చాలా అవమానంగా అనిపించింది. కళ్ళలో నీరుబికిరాగా తల దించేసుకున్నాడు, ఇంతలో అనసూయమ్మ వంటింట్లోంచి పిలిచింది టిఫిన్ ప్లేట్లు, కాఫీకప్పులు తీసికెళ్ళమని. చాలా కాలం తరువాత నవ్విన యాదగిరికి నిప్పుమీద నీళ్ళు చల్లినట్లు, ఆ వెంటనే అవమానం, ఇంకా దిగమింగే ప్రయత్నంలోనే వున్నాడు. ఆ మానసిక సంఘర్షణకి సూచనగా యాదగిరి చేతిలో వున్న టీ కప్పులు కదలసాగాయి టీ పాయి మీద పెట్టబోతున్నప్పుడు కాఫీ వొలికి ఒకబ్బాయిమీద పడింది. దీనంగా చూశాడు యాదగిరి. ''ఫర్వాలేద'' న్నట్టుగా నవ్వాడబ్బాయి. కాని ఫర్వావుంది అన్నట్టుగా


అనసూయమ్మగారి చూపుల్లో యిదంతా పడనే పడింది. అప్పటికి యేమీ మాట్లాడక ఆ రాత్రికి అన్నం పెట్టలేదు యాదగిరికి. వరండాలో తన చాపమీద మోకాళ్ళ మధ్య తల దూర్చి కూర్చున్నాడు యాదగిరి. అదే వరండాలో కుక్క టామీ తోకాడించుకుంటూ కూర్చుంది. అనసూయమ్మ టామీకి పాలన్నం ప్లేటులో కలిపి తెచ్చింది. అది హాయిగా తింటోంది. యాదగిరికి కడుపులో ఆకలి. కుక్కే తనకన్నా మేలు. ఎక్కువ ప్రేమగా చూడబడుతోంది. దానికెంతో ప్రత్యేకతుంది. తనుమాత్రం వాళ్ళ పిల్లలు యీడు వాడైనా ఆడుకోకూడదు, నవ్వకూడదు, వయసుకు మించిన పనులుచేస్తూ, బరువులు మోస్తూ ఏలోపం రానీకుండా వుండాలి. ఈ అసమానత ఎందువల్లో అర్థం కాలేదు యాదగిరికి. మళ్ళీసారి పెద్దమ్మ వచ్చినప్పుడు చాలా కోపంగా చెప్పాడు తనని తీసుకు పొమ్మని. పెద్దమ్మ మాత్రం "అట్లంటే ఎట్లా? లాడు చేస్తున్నవు గిన్ని దినాలైనా యింకా కొత్తనేనా బిడ్డ. ఇడనే వుండి అమ్మకు అయ్యకు బాగా పనిచేస్తే నువ్వు పెద్దగైనంక గవర్నమెంటు కొల్వు పెట్టిపిస్తరు. పని మంచిగ చేయాలె మొన్న కోపులు (కప్పులు) పడగొట్టినవంట అమ్మ కోపమయింది. గసుంటి పనులు తొత్తరంతోని చెయ్యాలె ఎర్కయిందా" అంది వెళ్ళిపోతూ తనకిది తప్పని శిక్ష అని చెప్పి వెళ్ళున్నట్టనిపించింది యాదగిరికి.

* * * *

అవి ఏసియాడ్ జరుగుతున్న రోజులు. రాత్రి పన్నెండు దాక టీ.వి చూశారందరు. యాదగిరి కూడ వరాండాలో కూర్చొని హాల్లో వున్న టీ.విని చూశాడు సంతోషంగా. మర్నాడు పొద్దున్నే రామనాథం పిల్లలు అదే మైకంలో వున్నారేమో ఆడటం మొదలెట్టారు. బంతి వేసి బ్యాట్‌తో కొడుతున్నారు హాల్లోనే, ఒకసారి అలా కొట్టిన బంతి షోకేస్ అడుక్కి వెళ్ళి పోయింది. "రేయ్ యాదగిరి ఆ బాల్ తీసియ్యి" అనరిచాడు ఆ పిల్లాడు. యాదగిరి వచ్చి రెండు మోకాళ్ళమీద పడుకొని షోకేస్ అడుక్కి తలపెట్టి తీశాడు బంతిని. "అక్కణుంచే వేసెయ్" అన్నాడా అబ్బాయి. యాదగిరి వేశాడు. అది గురితప్పి నేరుగా వెళ్ళి టీ.వి స్క్రీన్ని ముద్దు పెట్టుకుంది. ముందు రోజు మరీ రాత్రవ్వడం వల్ల టీ.వి తలుపులు కూడ వేయకుండా పడుకున్నట్టున్నారు. టీ.వి స్క్రీను పెద్దగా శబ్దం చేసింది. యాదగిరిలో వణుకు మొదలైంది మెదడు చురుకుగా ఆలోచిస్తుంది, "అమ్మో కాఫీ కప్పులకే అంత రాద్ధాంతం జరిగింది ఇక టీ.వి అంటే మాటలా. రాత్రి వాళ్ళు టీ.వి చూడలేరు. తనని చూస్తూ వూరుకోలేరు పెద్దమ్మతో చెప్తారు. ఆమెకి కోపం వస్తుంది ఎంత డబ్బవుతుందో ఏమో. తప్పెవరిదైనా శిక్ష తనకి తప్పదు. యాదగిరిలో మొండి ధైర్యం ప్రవేశించింది. బయటకు వచ్చి గేటు తీసుకొని పరిగెత్తడం మొదలెట్టాడు. కొంత సేపు పరిగెత్తి తనవెవరూ వెంటాడటం లేదని నిర్ణయించుకొని నడవటం మొదలెట్టాడు. నడుస్తూనే ఆలోచిస్తున్నాడు. "పిరికిగా వూరికె పారిపోకూడదు. ఎలాగైనా కష్టపడి ఏదో ఒక పని చేసి డబ్బు సంపాయించాలి అమ్మకు పంపటానికి. ప్రస్తుతం తన తిండికి సరిపడైనా చూసుకోవాలి" అలా సాగుతున్నాయి యాదగిరి ఆలోచనలు. ఇంతలో ఎవరో రోడ్డు వారగా విపరీతంగా దగ్గుతున్నట్టనిపించి అటు కేసి చూశాడు యాదగిరి. ఒక ముసలి తాత. చిన్నగా పెట్టె, కొన్ని సామానులు పెట్టుకున్నాడు. పక్కన చిన్నబకెట్లో నీళ్ళు. ఒక సైకిలుకిపంపుకొడుతున్నాడు. కాని మాటి మాటికి దగ్గడంతో పంపు కదిలిపోయి గాలి ట్యూబుల్లోకి ఎక్కడం లేదు. యాదగిరి చాకులా వెళ్ళి తాత చేతుల్లోంచి లాక్కుని గబగబా పంపు కొట్టాడు. సైకిలు అతను రిలీఫ్‌గా మొహం పెట్టి పావలా యిచ్చాడు. అది తాతకిచ్చాడు యాదగిరి.

"చల్లగ బతుకు బిడ్డా" అంటూ జేబులో వేసుకున్నాడు తాత. "ఎట్ల బతుకాల్నే సల్లగ ఏంలేంది" అంటు తన సంగతి చెప్పుకొని "నీకు బాగ దగ్గుంది గద తాత. నీకాడ నేను పని చేస్త రూపాయిల చారాణెయ్యి సాలు" అనడిగాడు.

ముసలి తాత కాస్సేపాలోచించి 'గట్లనే' అన్నాడు.




ఆ రోజంతటికీ నాలుగు రూపాయలొచ్చాయి. యాదగిరి వాటా ఒక రూపాయి. తాత పెట్టెలో సామానులు పెట్టేసి, నీళ్ళు ఒంపేసి ఆ బకెటు పెట్టె పుచ్చుకొని దగ్గర్లోవున్న తన గుడిసెలోకి వెళ్ళిపోయాడు పడుకోవడానికి యాదగిరి తనకు వచ్చిన రూపాయితో బన్, ఛాయ్ కొనుక్కుని తిన్నాడు. అక్కడే వున్న ఒక గార్డెన్‌లో కాళ్ళు ముడుచుకుని తనలాంటి ఒంటరి గాళ్ళు, పనిచేసే పిల్లలు చాలా మంది పడుకోవడం చూశాడు. మెల్లిగా అక్కడ కెళ్ళి ఒకబ్బాయిని పలుకరించాడు.

"ఈడ కూసుంటే ఎవ్వ[redacted]నరా" అనడిగాడు యాదగిరి. "కొత్తోనివా నువ్వు వూరికె ఇక్కడ కూసుంటే, పడుకుంటే ఎవ్వలేమనరు. ఇది వున్నదే పబ్లిక్ కోసం. దీన్ని క్లాక్‌టవర్ గార్డనొంటరు" అనన్నాడా అబ్బాయి.

"అట్లనా" అంటూ ఆ అబ్బాయి పక్కనే పచ్చగడ్డిలో పడుకున్నాడు యాదగిరి. క్రింద పచ్చగడ్డి పరుపు, పైన ఆకాశం దుప్పటి. యాదగిరికి మొదటి అనుభవమే అయినా ఏడుపు రాలేదు. ఆరోజు తను కష్టపడి సంపాయించిన రూపాయి తనకెంతో తృప్తి నిచ్చింది. తనలాంటి వాళ్ళు బోలెడంత మంది అక్కడ వుండటం చూసి "తాను ఒంటరి వాడు కాదు, వీళ్ళంతా నా అన్నదమ్ములే" అనినిపించింది యాదగిరికి. ఒక రెండు రోజుల్లో యీ అన్నదమ్ములతోనే మాట్లాడి ఏదైనా పని చూసుకోవాలి పెద్దమ్మ తనని వెతుక్కుంటూ వచ్చినా తను మళ్ళీ రంగనాథం యింటికి రానని తనకి మంచి వుద్యోగమే వచ్చిందని చెప్పాలని నిశ్చయించుకున్నాడు యాదగిరి.

* * * *

యాదగిరి కృషివల్ల అక్కడబ్బాయిల్లో ఒకడు "ఆటోమొబైల్ వర్క్‌షాప్‌లో యిప్పిస్తాను రమ్మ"ని తీసుకెళ్ళి పని కుదిర్చాడు. నెలకి యాభై రూపాయలు జీతం అంటూ పదిరూపాయలు అడ్వాన్సుగా యిచ్చాడు యజమాని. యాదగిరి పని చేయడం మొదలెట్టాడు. అప్పుడే మిషన్ మీద పని చెయ్యవద్దని షాపు తుడవడం, రిపేరు అయిపోయిన మోటారు సైకిళ్ళని శుభ్రంగా పాలిష్ చెయ్యడం, యజమానికి ఛాయ్, సిగరెట్లు తేవడం మొదలైన పనులు చేస్తున్నాడు. యాదగిరి ఎంతో శ్రమ వున్నా అందరు అక్కడ పనిచెయ్యడం వల్ల, వాళ్ళతోపాటు కలిసి పనిచేయడం యాదగిరికి సరదాగా వుంది. పగలంతా వర్క్‌షాప్‌లో పని, రాత్రి గార్డెన్లో నిద్ర. ఆరుబయట పడుకోవడం అలవాటు లేని మూలంగా యాదగిరికి నాలుగో రోజు జ్వరం, వళ్ళు నెప్పులూ వచ్చాయి. మర్నాడు పొద్దున లేవలేక పోయాడు. నీరెండలో అలా పడుకుండి పోయాడు రోజంతా. ఆ మర్నాడు షాపుకెళ్తుంటే తనతో వచ్చే పిల్లాడు చెప్పాడు. ఎన్నిరోజులు రాకపోతే అన్ని రోజులు జీతం కోసేస్తారని, కోసి తిట్టనూ తిడ్తారని.

షాపుకెళ్ళాక ముందే చెప్పడం వల్లనేమో యాదగిరి పెద్దగా బాధ పడలేదు యజమాని తిట్లకి. మౌనంగా చీపురు తీసి వూడవసాగాడు. వచ్చే జనం పోయే జనం. వూడవడం అయ్యాక ఒక మోటారు సైకిలు తీసి తుడవడం మొదలెట్టాడు.

'బండి రెడీగా వుందాయ్[redacted]న్యుయల్' అంటూ ఇద్దరు యువకులు వచ్చారు. యాదగిరి తుడుస్తున్న

బండి వాళ్ళదే కాబోలు. "జల్ది మంచిగ తుడువురా సార్‌కు" అంటూ యాదగిరిని కేకేశాడు యజమాని యిమాన్యుయల్. ఆ బండిదగ్గరే నుంచుని మాట్లాడు తున్నారు వాళ్ళిద్దరూ.

"ఆఫీసు కెళ్ళాలా నువ్వు" అనడిగాడొకబ్బాయి.

"అహ జ్వరం వచ్చింది ఇ.యస్.ఐ ఆసుపత్రి కెళ్ళి సెలవు రాయించుకున్నాను" అన్నాడు మరొకడు.

యాదగిరి యీ మధ్య చొరవగా అడుగుతున్నాడు తన సందేహాలన్నింటినీ, అందరిని.

"నాక్కూడ జ్వరం వచ్చింది దొర ఆ ఆసుపత్రి నేమబోత చెప్పవా" అనడిగాడు యాదగిరి.

"జ్వరం వచ్చిందా, ఆ ఆసుపత్రి మీక్కాదురా పెద్దపెద్ద కంపెనీలో పనిచేసే వాళ్ళకే" అనన్నాడతను.

"ఇది పెద్దదిగాదా" అనడిగాడు యాదగిరి.

"వూహు!" అంటూ జేబులోంచి మాత్ర తీసి యిచ్చి "యింద యిది వేసుకొని ఛాయ్‌తాగు తగ్గిపో తుంది" అన్నాడు.

"దండం దొరా! వేన్కుంట గాని, యెండ్ల పనిచేసినా మనుషులేగద దొర. ఇంక చెప్పాల్నంటే చిన్నచిన్న వాల్ల పనిచేసేటోల్లకే తక్కువ జీతాలుం టయి. వాళ్ళను చూడొద్దా" అనడిగాడు యాదగిరి.

"అవునుకో" అని సాలోచనగా అంటూ తయా రైన తన బండిని తీస్కొని బయల్దేరాడు. బండి సాఫీగా వెళ్తోందేకాని ఆలోచనలు మాత్రం యాదగిరి అడిగిన ప్రశ్న నుంచి ఒకడుగు కూడా వెయ్యలేక పోతుంది. అక్కడే ముసురుతున్నాయి. మన దేశంలో యెన్నివేల పసిపిల్లలు హాయిగా ఆడుకుంటూ, చదువుకుంటూ వుండవలసిన వయస్సులో వయసుకి మించి, రాత్రి పగళ్ళు, ఆటపాట ఏదీలేక, ఆ రెంటికీ దూరాన అతి దూరాన వుండి శ్రమిస్తున్నారు. చాలావరకు చిన్న చిన్న షాపులు, ఎక్కువగా పిల్ల నౌకర్ల వల్లే నడుస్తోందని చెప్పవచ్చు. యజమానులకు మరి అదే లాభసాటి. జీతం తక్కువ యిచ్చి ఎక్కువ పని చేయించుకోవచ్చు. ఎదురు తిరగరు. ప్రభుత్వం బాల నౌకర్లని ఎలాగూ పెట్టుకోకూడదని ఆర్డర్లు జారీచేసినా నిజంగా ఎక్కడ జరుగుతోంది. యజమానులు పెట్టుకుంటున్నారు. గత్యంతరంలేక పిల్లలు పొట్టకూటికోసం చెయ్యనూ చేస్తున్నారు. ఈ విషవలయం నుంచి మన భారతీయ పిల్లలకి విముక్తి దొరికేదెప్పుడో. అలా ఆలోచనలు ముట్టుముట్టాయి ఆ అబ్బాయిని.

* * * *

యాదగిరి మాత్రం తను "యింకొంచెం పెద్ద య్యాక యీ సార్లతోనే చెప్పి పెద్ద కంపెనీలో కెళ్ళిపో వాలె" అని నిశ్చయించుకొని కాలచక్రం తొందరగా తిరిగితే బావుణ్ను అనుకుంటున్నట్టుగా మోటారు సైకిలు చక్రాన్ని గిరగిరా తిప్పుతూ తుడుస్తున్నాడు. ●

అంకితం:— రోడ్డువారగా గొడుగు రిపేరు చేస్తున్న పధ్నాలుగేళ్ళ రాములుకి, సైకిలు రిపేరు చేస్తున్న పదేళ్ళ యూసుఫ్‌కి సికిందరాబాద్ రైల్వే గెస్టు హవుస్ దగ్గర గడ్డంగీసే పన్నెండేళ్ళ నరసిమ్మకి, అలాంటి తమ్ముళ్ళందరికీ యిది అంకితం.

— రచయిత్రి.

# శుభం! శుభం! జన్మదినం

సెప్టెంబర్ 8 నుండి సెప్టెంబర్ 14 లోపున పుట్టిన రోజు జరుపుకున్న ప్రియపాఠకులకు ఉదయం నవతరం వారపత్రిక శుభా కాంక్షలు అందిస్తోంది.



మహమ్మద్ షరీఫ్
పుట్టిన తేదీ
8–9–89
హైదరాబాద్.



టి.శ్రీనివాస్
పుట్టిన తేదీ
9–9–89
భువనగిరి.



శ్రీహరి కృష్ణవేణి
పుట్టిన తేదీ
10–9–89
కవాడిగూడ



హరీష్ కుమార్
పుట్టిన తేదీ
11–9–89
ఖానాపూర్.



ఎస్.శ్రీనివాస్
పుట్టిన తేదీ
12–9–89
హైదరాబాద్.



వల్లూరు చంద్రశేఖర్ రెడ్డి
పుట్టిన తేదీ
13–9–89
మలక్‌పేట.



గోపి
పుట్టిన తేదీ
14–9–89
హైదరాబాద్.

సెప్టెంబర్ 24 నుండి సెప్టెంబర్ 30 లోపున పుట్టిన రోజు జరుపుకునే ప్రియ పాఠకులూ, మీ ఫోటోతో పాటు, ఈ కూపన్ పూర్తి చేసి పంపండి, ప్రచురిస్తాం.

**కూపన్**

పేరు: ______________________

పుట్టినతేదీ: ______________________

చిరునామా: ______________________

సంతకం: ______________________

